కథానిక

# జ్ఞానోదయం

కె. ఆర్. రెడ్డి

ఆఫీసు గుమ్మంలో అడుగు పెట్టగానే 'తెచ్చావా?' అన్నాడు హెడ్ క్లర్కు రామస్వామి.

"ఛఁ..." అని పెదవి కొరుక్కొని 'మరిచానండి. రేపు తప్పకుండా తీసుకొని వస్తాను' అంటూ బిక్కమొహం వేశాడు భాస్కరం.

"పిల్లా — పాప — అరవై ఆరుగురి సంసారం. ఎక్కడ జ్ఞాపకముంటుంది పాపం!" పేలవంగా నవ్వాడు హెడ్ క్లర్కు.

"పోనీ —సాయంత్రం వెళ్ళేప్పుడు— ఒక మట్టి బెడ్డ జేబులో వేసుకుని వెళ్లు. రేపు ఉదయం జ్ఞాపకానికి వస్తుంది."

• • •

హెడ్ క్లర్కు రోజూ రంపానపెట్టి రాసుకతింటున్న "మను చరిత్ర" కోసం పుస్తకాల బీరువా కదిపాడు. బూజుపట్టి మాసిపోయిన పుస్తకాలను దులుపుతూ వుండగా ఏదో చిరిగిపోయిన కాయితాల్లోంచి ఒకఫోటో క్రింద పడింది. చెరుగులు చిరిగిపోయి అంతా బూజుమయంగా వుంది. ఎత్తి శుభ్రంచేసి ధ్యాసగా చూశాడు భాస్కరం దాని వేపు.

ఎవరీ భువన సుందరి!

ఆరేళ్ళ క్రితంనాటి పంచరంగుల చలన చిత్రం అలా కదిలిపోయింది అతడి కళ్ళముందు.

పెళ్ళిచూపులకు వెళ్ళాలి రమ్మన్నాడు పితృదేవుడు.

భాస్కరం వెళ్ళాడు.

షడ్రసోపేతమైన పంచభక్ష్యాలు సుష్టుగా మెక్కిన తరవాత హాలులో అందరూ సుఖాసీనులైనారు.

బొంబాయి క్రేపు సిల్కుచీరె కుచ్చెళ్లు చిగురుటాకు పాదాలతో చుంబన క్రీడ లాడుతుండగా వచ్చి కూర్చుంది ఒక దివ్యాంగన.

నిర్మల నీలాకాశంలో ఒక తటిల్లత తళుక్కుమంది. భాస్కరంకళ్లు జిగేలుమన్నాయి.

ఎవరీ మోహనాంగి! దివినుండి భువికి...ముగ్ధమోహన సౌందర్యానికి దాసోహమన్నారు ఎవరో అతడి హృదయాంతరాల్లోంచి.

సన్నగా, పల్చగా-ప్రబంధాల్లోని లావణ్యంతో-గులాబి దళాల్లాంటి పెదవులపైన నిండుజాబిల్లి ముఖంతో వెన్నెలనవ్వులు కురిపిస్తున్నది.

కావ్యాల్లో వర్ణించిన పిడికిలికికూడా చాలని అవలగ్నం—ఈ సుందరాంగిదేనా!

"పాటలేమైనా వచ్చునా?" ఒక బుద్ధి వృద్ధుడి ప్రశ్న.

"ఒక పాట పాడవే శశీ!" ఎదుటివారి సంభాషింపు.

శశీ!

ఎంత చక్కటిపేరు! అందము - అందానికితగ్గ ఆకర్షణ— అన్నిటినీ అన్వయించుకున్న పేరు— తన్మయం పొందాడు భాస్కరం.

వసంతకాలపు లేమామిడి చివుళ్ళు మెక్కి వగరుతో బాగరెక్కిన కోయిలమిన్న ఎక్కడో-ఏలోకంలోనో తీయగా - హాయిగా - మనసారా పాడేసింది.

• • •

"ఆ అవలగ్నం పిడికిలికి కూడా చాలదేమో!' నునుసిగ్గుతో జేగురించి దీపించింది శశిముఖం.

"ఆ కనుసోగల కోసం ఏ విలుకాడికి దగా చేసిందో!" మనసులోనే పలవరించాడు భాస్కరం. పలవరించడంలో పైకే అనేశాడు. అనేసి నాలుక్కరుచుకున్నాడు.

ముగ్ధంగా స్నిగ్ధంగా నవ్వేసి పడకటింటి పూసెజ్జపైన వాలింది శశి.

తామర దళాలవంటి కపోలములమీద చిన్నని-సన్నని- సొట్టలు. ఎంత అందం! ఎంత సౌందర్యం!

"స్నానానికి లేవండి — నీళ్ళు సరిచేశాను." అనేసి తువాలు తీసుకుని వెళ్ళిపోయింది శశి.

ధ్యాసగా- ఉత్కంఠగా శశివేపుచూస్తూ వుండి పోయాడు అతడు.

ఎవరీమె! తన ఇల్లాలు శశియేనా? ఆనాటి శశికీ — ఈనాటి శశికీ ఎక్కడిదీ భేదం? ఎక్కడి నుంచి వచ్చింది?

ఒడుదుడుకులూ, నిమ్నోన్నతాలు లేని నడు గాదెలా దొర్లిపోతున్నది శశి. శరీరమంతా నీరెక్కి అందంలేని కండరాలు బలిసిపోయాయి. వాలు కండ్లు పూడిపోయి గుండ్రంగా, చిన్నవిగా, గుహ ల్లోని జీవపదార్థాల్లా వున్నాయి.

అసహ్యంవేసింది భాస్కరానికి.

అందం లేదు, మార్దవం లేదు. ఎత్తుపల్లాలు లేని విప్పుళ్ళబస్తా అనుకున్నాడు పేలవంగా నవ్వుకుని.

ఆరేళ్ళక్రితం తన కళ్ళను తానే నమ్మలేక పోయాడు శశిని చూచి. ఈనాడు కూడా తన కళ్ళను తానే నమ్మలేకపోతున్నాడు. అవస్థ ఒకటే. కాని అంశాలు వేరు.

ఆనాడు లావణ్యం.

ఈనాడు లావుపాటితనం.

ఎక్కడో ఎన్నడో అణగిపోయిన వాంఛలు, కోరికలు, తృష్ణలు, ఆకలిగొన్న అడవిమృగాల్లా విజృంభించాయి అతని హృదయంలో. వాటికి కోరిన ఆహారం కరువయింది. అందుమూలంగా తృష్ణ కూడా అధికమించింది. రోజూ తన కళ్ళ ముందే ఏపుగా పెరిగిపోయిన శశి శరీరంపైన, ఎన్నడూలేని ధ్యాస యివాళ ఎందుకు కలగాలి?

"శశి!" ఆనాడేమోకాని, ఈనాడు ఆ పేరు "బోడితల నీలవేణి, కుంటికాలు మందయాన, మెల్లకన్ను మీనాక్షి"లా వుంది శశికి. అసహ్యం వేసింది అతడికి అర్థంలేని పేర్లు. నాలుగేళ్ళ కుర్రాడిని 'కుమార్!' అంటే అందం కాని, మీసాలు గడ్డం నెరసిన వృద్ధయోధుణ్ణి 'కుమార్!' అనడంలో ఏవగింపు తప్పనిచ్చి మరేముంది?

ఫొటోవంక చూశాడు. తను పెళ్ళిచూపులకు వెళ్ళినప్పుడు తెచ్చుకున్నది అది. ఈ పుస్తకాల్లో దాగుకుంది యిన్నాళ్లూ. అప్పట్లో ఆ ఫొటో తన హృదయాంతరాల్లో చిందులుతొక్కి మంజుల వాయిద్యాలు వాయించింది. కాని యిప్పుడు ఏదో ఓర్వలేనితనం, ఈర్ష్య రేపుతోంది.

చింపి ముక్కలు క్రింద చిదుగులో పడవేశాడు.

"లేవండి, నీళ్లు చల్లారిపోన్నాయి."

"ఎంత లావైపోయింది! ఆ సుకుమార మార్దవ సౌందర్యమంతా ఏమైపోయినట్టు! ఆ మధ్యగా అవుపించీ అవుపించని నడుం ఎక్కడ! సోగకన్ను లేవి! కోలముఖం ఏమయింది?' ఉత్కంఠగా చూశాడు శశిని.

"ఎందుకలా చూస్తూ నుంచున్నారు?"

"ఆఁ,... ఏమీలేదు." స్నానాల గదికి వెళ్ళి పోయాడు.

"ఎందుకండీ అలా వున్నారు, ఒంట్లో బాగా లేదా?"

"నిక్షేపంలా వున్నాను."

శశికి ఆశ్చర్యంవేసింది. ఎందుకిలా వున్నారు! ఎన్నడూ ఈ ఆరేండ్ల జీవితంలో తనపైన విసుక్కున్నది లేదు. తను యివాళ ఏమి తప్పుచేసింది?

• • •

"అన్నంలో నీళ్ళు పోసుకుంటున్నారండీ!" నవ్వేసింది శశి.

ఆ నవ్వులో ఆకర్షణ లేదు, మార్దవం లేదు. ఆనాటి వెన్నెల పువ్వులు అందులోంచి రావటం లేదు. చిరాకేసింది భాస్కరానికి.

అన్నంవేపు చూశాడు. మజ్జిగబదులు నీళ్లుపోసుకున్నాడు పరధ్యానంలో. అతడికే నవ్వువచ్చింది. కాని నవ్వలేకపోయాడు.

• • •

"ఇవాళ సినిమాకు వెళ్ళాలి, కాస్త తొందరగా రండీ!"

"వీలవదు."

"ఏం, ఎందుకని వీలవదు?" నవ్వింది శశి.

"వీలవదంటే నోరుమూసుకుని వూరకుండాలి. అడ్డప్రశ్నలు వేయడం మరీ ముదిరిపోయింది యీ మధ్య."

వెళ్ళిపోయాడు భాస్కరం.

గుమ్మం దాటుతూంటే వెంకాయమ్మ ఎదురయింది. దూదిబస్తాలాగా ఆరు చదరపుటడుగుల విస్తీర్ణాన్ని ఆక్రమించిన బొజ్జ—నడుగొండలాగుంది.

"ఛీ!" అనుకున్నాడు అతడు. "ఈ ఆడవాళ్ళందరూ యింతే. కాపురానికి వచ్చిన రెండేళ్ళకే తెగ బలిసిపోతారు. అందం చందం మాట అటుంచి అసహ్యం పుట్టించకపోతే అదే పదివేలు."

ఆఫీసుకు వెళ్ళేవరకు ఇవే ఆలోచనలు. బజార్లో కంటబడే ప్రతివ్యక్తిమీద కళ్ళు సర్వే చేస్తున్నాయి. మనోపీఠంమీద వాళ్ళ శరీరం తాలూకు ఒక కాంటూరు మ్యాప్ గీస్తున్నాయి. 'బిడ్డా—పాపలేక—ఆరేళ్ళ జీవితంలోనూ శశి—అనవసరపు కండల్ని అసహ్యంగా పెంచుకుంది.' అదే ధ్యాస అవే ఆలోచనలు.

ఇంకా క్లర్కు లెవ్వరూ ఆఫీసుకు రాలేదు. తొమ్మిదిన్నరే అయింది. దినపత్రికను తిరగవేస్తూ టేబిల్ వద్ద కూలబడ్డాడు 'ఉష్!' మంటూ.

"బొందుశరీరాలకు దివ్యౌషధం" జిగేలు మన్నాయి కళ్ళు.

"రజితభస్మ లేహ్యము. మాసం రోజుల్లో శరీరం రెకరెకమని యథాస్థితికి తగ్గిపోవాలి. 15 రోజుల ఔషధం—పోస్టేజీలతో సహా 2-8-0."

అలాంటి ప్రకటనలన్నీ వట్టి బూటకం అని ఆ ప్రసంగం ఎత్తినవాళ్ళతో అర్థగంటసేపా లెక్చర్ క్లాసు తీసుకునే భాస్కరానికి యివాళ ఏదో క్రొత్త ఊహాలు మొలకలెత్తేయి.

శశికి ఈమందు తెప్పించి వాడితే!

"హల్లో! భాస్కరం! ఏం అప్పుడే వచ్చారివాళ" రెపరెపమని గాలిలో తేలుతున్నట్టు నడిచి వచ్చి విష్ చేసింది, లేడీ టైపిస్టు లీల.

"ఆఁ ఏదో వచ్చేశాను." ముక్తసరిగా అనేసి పేపరువేపు దృష్టి పోనిచ్చాడు. కాని, మనసులో మళ్ళీ ఏదో ఒక క్రొత్త అధ్యాయం కలవరింత. 'లీల ఎంత సన్నగా వుంది! ఎంత అందంగా వుంది!' తల పైకెత్తి ఆమెవేపు చూశాడు. ఆమె తన పనిలో నిమగ్నమైపోయింది.

ఆనాటి శశి ఈనాటి లీలలో అవుపించింది.

అతడెన్నడూ లీలవేపు అంత పరీక్షగా చూడ లేదు.

"ఆ సన్నగా పల్చగా కోలగా...

"అబ్బ! అంతా కొన్నాళ్ళకు అదృశ్యమై పోయి బొరుగుల బస్తాలా ఛఁ! అందరూ అంతే'

ఆరోజు ఆఫీసుపని ఏమీ సవ్యంగా సాగలేదు. హెడ్ క్లర్కు రెండుమూడు పర్యాయాలు పిలువ నంపి 'ఎందుకిలా పొరపాట్లు చేస్తున్నావీ రోజు! ఈ లిస్టు మళ్ళీ సరిచూసిపెట్టు.' అని కేకలుకూడా వేశాడు.

"శశి!" ఆరేళ్ళ క్రితం.

"శశి!" ఆరేళ్ళ అనంతరం.

తనను అందంతో ఆనందాతిరేకంలో ఆకర్షించి అమరానుభూతుల్ని అందించే ఆకర్షణ ఆమెలో లేదు. జీవితంలో ఎక్కడో తన ఆనందనౌక నడియేటిలో పడి సుడిగుండం ప్రభావానికి విలవిల లాడుతున్నట్టనిపించింది.

చిరాకు—బాధ — అసహ్యం — ఆవేదన. ఆ ఫోటోను ఎందుకు చింపివేశాను? నాలోని ఏ దుష్టశక్తులు ఆ కార్యానికి పాలుపడ్డాయి? అంతా అయోమయం.

• • •

"హల్లో! భాస్కర్! ఏరా ఆఫీసునుండేనా రావడం? చప్పున తిరిగి చూసి 'ఆఁ ఇంటికి వెడుతున్నాను.' అనేశాడు భాస్కరం ముక్తసరిగా.

ఎదుట నుంచున్న గున్నయేనుగలాంటి మనిషి ఎవరో భాస్కరానికి అంతుచిక్కటం లేదు. అతడు తలా—మెడా, కడుపూ—నడుమూ, ఒక్కటేగా కబంధుడిలా నుంచున్నాడు అతడిముందు.

"ఏఁరా! మరిచిపోయావా?'

"ఆఁ మరేఁ మరి—"

"వెంకటేశాన్ని గాదుట్రా-బోర్డు హైస్కూల్లో"

"అరే! నీవట్రా వెంకటేశం! ఇలా తయారయావు చిన్న ఏనుగులాగా!" అంటూ నిర్ఘాంత పోయాడు భాస్కరం.

"మన చేతుల్లో ఏముంది. దేవుడిచ్చిన దానిని వద్దంటామా! వ్యాపారంమీద ఉదయమే యీ వూరువచ్చాను. కాఫీ పుచ్చుకుందాం రావోయ్." అంటూ వెంకటేశం మినర్వా కేఫ్లోకి దారితీశాడు.

• • •

"హైస్కూలు రోజుల్లో రెకరెకమని రెమ్మలా వుండి తారాజువ్వలా పరుగెడుతున్న-రన్నింగ్ రేస్ ఛాంపియన్, వెంకటేశమేనా వీడు!" ఆశ్చర్యమేసింది భాస్కరానికి.

వెంటనే శశి మనోపథంలో మెరిసింది అతనికి.

"దేవుడిచ్చిన దానిని వద్దంటామా!" నవ్వొచ్చింది. అలా కాదు అసాలిసింది. "దేవుడిచ్చిన దానిని వద్దనగలమా!" అసాలి అనుకున్నాడు పేలవంగా నవ్వుకుని.

అతనిలో ఏదో బాధ కలిగింది. అంతా విధి విధానము. ఎవళ్ళు మాత్రం ఏమిచేయగలరు?"

"నిష్కారణంగా శశికి బాధ కలిగించాను. ఎన్నడూ యిలా మాట్లాడలేదు. ఏమనుకుందో! ఎంత బాధపడిందో!" మథనపడి పోయాడు. పూల మార్కెట్టుకు వెళ్ళి మల్లెపువ్వులు ఒక పొట్లం కట్టించుకున్నాడు అదే ధ్యాసలో.

* * *

"ఏమిటండీ అది?" "చెప్పుకోవాలి మరి."

"నీ ముహం" నవ్వాడు భాస్కరం.

ఆరేళ్ళ జీవితంలోనూ ఎన్నడూ మార్కెట్ నుంచి పూలు తీసుకురాని భాస్కరం యివాళ... ఆశ్చర్యపడింది శశి.

"త్వరగా అలంకరించుకో, సినిమాకు వెళ్ళాలి. విస్తీర్ణము తక్కువయితే గదూ పేగిరం తెమల డానికి" ఫక్కుమని నవ్వాడు భాస్కరం.

అపుకోలేక నవ్వేసింది శశికూడా.

ఉదయం తొమ్మిదింటిదాకా తనమీద చిటమటలాడిన భాస్కరం సాయంత్రం నాలుగింటి కంతా ఇంతగా ఎలా మారిపోయాడు అని నిర్ఘాంత పోయింది శశి.

"ఏడు గంటల్లో ఎంతమార్పు!" అనుకుంది ఆమె హృదయం తృప్తిగా తేలికపడి.

ఉదయం చూపిన చిటమటకూ సాయంత్రం చిందిన చిరునవ్వుకూ అంతర్యం యేమిటో శశికి ఈనాటికీ తెలియదు.

---

స్కెచ్

# చతురత్యాగం

"బనఫూల్"

ఆమె అందాన్ని వర్ణించట మనవసరం. అసలు ఈ రోజుల్లో అందాన్ని వర్ణించ కూడదు. కాని—

ఆమె చాలా అందంగా ఉంటుంది. ఆమె ఆస్పత్రిలో నర్స్. ఆమెనూ ఆమె అందాన్నీ చూచి సేనాపతి చిత్తయిపోయాడు. అతని భావాల్నామె గ్రహించిందో ఏమిటో, ఏదో మిష మీద తరుచు సేనాపతి దగ్గరకు వస్తుండేది, యుద్ధంలో సేనాపతికి గాయం తగిలింది. ఆస్పత్రిలో పడేశారు. కొన్నాళ్ళకు ఆ గాయం నయమైపోయింది. మరుచటినాడు ఆస్పత్రినుండి విదుదలవుతుందతనికి. ఆ గాయం నయమైనా, ఈ చిన్నారుండే—అబ్బబ్బా! మరో గాయానికిమల్లే అతని హృదయంలో చిటుకూ పటుకూమంటూ అతన్ని మరీ బాధపర్చ సాగింది. ఆమెను చూచి నప్పుడల్లా సేనాపతికి మతిభ్రమించినట్లుగావుండేది.

మరి రెండురోజుల్లోగా సేనాపతి తిన క్యాంపులో వుండాలి. కిటికీనుండి బయటికి చూడ సాగాడు. అంతా చీకటి. అప్పుడే అతనికోసం భోజనం తీసుకొచ్చిందామె. ఆమెను తనివితీరా చూస్తూ— "నేను రేపే వెళ్ళిపోవాలి" అన్నాడు, ఏదో పోగొట్టుకున్నవాడికిమల్లే. 'అవున'న్నట్టు తల ఊపింది.

"నేను వెళ్ళిపోయాక, నేను జ్ఞాపకానికి వస్తే నీకు చాలా బాధగా ఉంటుంది కదూ!" అన్నాడు సేనాపతి.

"ఆ విషయం నాకన్నా మీకే బాగా తెలుసు" అందామె.

"నాతో వస్తావా?"

"ఎక్కడికి?"

"నా క్యాంప్‌కి."

"ఎందుకు?"

"ఎందుకా? నీకు తెలీదూ? పోనీ ఒక్కరాత్రి కోసం."

"ఉద్యోగం వదిలి ఎలా రాను!"

"సెలవు తీసుకో."